# బలహీనత


### శ్రీమతి గంజాం జ్యోత్స్న



డబుల్ కాట్ బెడ్ మీద బోర్లా పడుకొని గాఢంగా శ్వాసిస్తూ నిద్రపోతున్నాడు సన్యాసిరావు. రైయంటూ శబ్దం చేస్తూ సీలింగ్ ఫ్యాను, ఎడతెరపి లేకుండా తిరుగుతున్నా అతని శరీరం చెమట పట్టే ఉంది. ట్రుర్‌ర్....ట్రుర్‌ర్.... అంటూ ఫోన్ మ్రోగటంతో. మెలకువ వచ్చిన సన్యాసిరావు స్పృహలోకి వచ్చినట్టే వచ్చి ఓ ప్రక్కకు వత్తగిల్లి పడుకున్నాడు. ఈసారి దుప్పటి నిండుగా ముసుగేసుకున్నాడు యధాలాపంగా. ట్రుర్‌ర్.... ట్రుర్‌ర్.... అవతలి వాళ్ళ అవసరాన్ని తెలియజేస్తూ మరోసారి అరుపులంకించుకుంది టెలిఫోన్. దుప్పట్లో భారంగా కదిలాడు సన్యాసిరావు. బద్దకంగా బెడ్‌పై నుంచి లేచి గట్టిగా ఒళ్ళు విరుచుకున్నాడు. ఇంకా వీడని మత్తుతోనే చేతులతో కళ్ళను నలుపుకుంటూ టెలిఫోన్ దగ్గరకెళ్ళాడు. లిఫ్ట్ చేస్తూ 'హ.....లో' పెద్దగా ఆవలిస్తూ పలికాడు. 'నేనండి శకుంతల్ని...... ఇప్పటిదాకా ఏం జేస్తున్నారు? నేను డయల్ చెయ్యటం ఇది రెండవసారి" అంటూ విన్పించింది అవతలి కంఠం.... 'ఏంటి? మీకిప్పుడే తెల్లవారిందా? తొమ్మిది గంటలవుతుంటే' శకుంతల కోపంగా అంది. అది వింటూనే చప్పున వాల్ క్లాక్ వంక చూశాడు సన్యాసిరావు. నిజమే చాలా ప్రొద్దెక్కింది. రాత్రి కొట్టిన మందు మత్తు ఇంకా పూర్తిగా దిగలేదు. అందుకనేమో మెలకువ రాలేదనుకున్నాడు మనసులో.

"ఏం లేదు..... కాస్త బడలికగా ఉంటేనూ...." మెత్తగా సమాధానమిచ్చాడు. 'నేను ఈ రోజు రావటం లేదు. అమ్మాయిని నిన్ననే హాస్పిటల్లో అడ్మిట్ చేశాము. ఇప్పటికి నొప్పులేం లేవు. ఏక్షణమైనా నొప్పులు మొదలై కాన్పు కావచ్చని డాక్టరుగారు అంటున్నారు. అంచేత మీకు చెప్పినట్లుగా నేనివ్వాళ రావటం లేదు. పైగా అమ్మాయి అత్తగారు ఒకటే గొడవ నన్నుండమని. దానికి తోడు మీ మనువరాలిది పెద్ద పేచి అయ్యింది. అస్తమానం అమ్మనే అంటి పెట్టుకొని ఉండాలంటుంది. దాన్ని సముదాయించటం అందరికి కష్టంగా ఉంది. అందువల్ల ఇక్కడి

(66వ పేజీ చూడండి)




పరిస్థితుల్ని బట్టి బయల్దేరి వస్తాను" చెప్పింది శకుంతల. ఆ మాటలు వింటూనే సన్యాసిరావు దిగాలు పడ్డాడు. భార్య ఇవ్వాళొస్తుందని చేతిలో ఉన్నదంతా ఖర్చు చేసి నిన్ననే త్రాగేశాడు. ఇక చేతిలో చిల్లి గవ్వలేదు. మందు పడకుంటే తను మనిషి కాదు. "ఏంటి చడీ చప్పుడు లేకుండా ఉన్నారు. ప్రొద్దున్నే తాగున్నారా?" అనుమానిస్తూ కోపంగా అడిగింది భార్య శకుంతల. "ఛ ఛ.... అదేం లేదు... అమ్మాయి కాన్పు గురించి ఆలోచిస్తున్నాను. జాగ్రత్త నార్మల్ డెలివరీ అయ్యేలా చూడు. మనలో ఏమాత్రం ఆదుర్దా కన్పించినా అమ్మాయి సిజేరియన్‌కు బలవుతుంది." తెలివిగా సమాధానమిచ్చాడు సన్యాసిరావు. "ఆభయమేం లేదులెండి. డాక్టరమ్మగారు బాగా తెలిసినావిడే అంటూ మీ గురించే నా ఆలోచనంతా" అంది భార్య. "నా గురించి నీవేమి దిగులు పెట్టుకోవద్దు. పక్కింటి విశాలాక్షిగారు నన్ను స్వంత మనిషిలా చూస్తున్నారు. కాఫీ టిఫెన్ల దగ్గర్నుంచి భోజనాల వరకు ఏం ఢోకా లేదు" పెద్దగా నవ్వుతూ అన్నాడు సన్యాసిరావు. "మీ తిండి తిప్పల గురించి కాదు నా చింత. మీ తాగుడు తందనాల గురించే." భార్య భయంగా అంది. కాసేపు ఏం మాట్లాడాలో తోచలేదు సన్యాసిరావుకు. తిరిగి తనే అందుకుంటూ, నా మీద మరీ నీకు బొత్తిగా నమ్మకం లేకుండా పోయింది. నీ అనుమానానికి కూడా ఓ హద్దుండాలి. అందుకేగా చేతిలో అరకొర డబ్బు పెట్టెళ్ళావు. అదేమంటే విశాలాక్షిగారున్నారంటావ్. నన్ను పసి పిల్లవాడి ననుకున్నావా? ఇంకా నా మీద అపనమ్మకమేనా?"

## బలహీనత

(55వ పేజీ తరువాయి)

నిష్ఠూరంగా అన్నాడు సన్యాసిరావు. "నేనుండి నయానా భయానా చెప్పుకొస్తుంటేనే ఇప్పటి వరకు మీ అలవాట్లో మార్పు రాలేదు. ఇక మిమ్మల్ని ఒంటరిగా వదిలేసి వచ్చిన తర్వాత నాకు బెంగ భయం కాక ఏముంటాయి చెప్పండి. అయినా ఇదంతా నా తలరాత. మనువళ్ళనెత్తే వయసొచ్చినా ఆ పాడలవాటు మీరు మానుకోరు. మీ నుంచి ఎన్నో అవమానాలు భరించాను. నలుగురిలో చులకనయ్యాను. అయినా మిమ్మల్ని మార్చలేక పోయాను." శకుంతల కంఠం గద్గదమై విన్పించింది. సన్యాసిరావుకు నిద్రమత్తు ఒక్కసారిగా వదిలినట్లైయింది. భార్య ఫోన్‌లో గూడా బావురు మనటంతో మనసంతా అదోలా అయిపోయి ఆ అంశాన్ని మారుస్తూ..... "సరెసరె... ఇదెప్పుడూ ఉండేదేగా.... ఇంతకి ఫోనెందుకు చేశావ్" అంటూ అడిగాడు. అవతల్నుంచి ఏమీ విన్పించలేదు. కొంగుతో ముక్కు చీదుకున్న శబ్దం విన్పించింది. నిన్నే.... అన్నాడు సన్యాసిరావు. శకుంతల తేరుకొని "నేను ఈ రోజే వస్తాననుకొని ఇవాల్టి వరకే లీవ్ పెట్టొచ్చాను. అవసరమవుతుందేమో అనుకొని ఎక్స్టి అప్లికేషన్‌పై సంతకం చేసొచ్చాను. అది బెడ్ రూమ్‌లో ఉన్న అలమరలో గ్రీన్ ఫైల్లో పెట్టొచ్చాను. దాన్ని పూర్తి చేసి మర్చిపోకుండా కాలేజిలో ఇచ్చిరండి" అంది. "అలాగా సరేలే చూస్తాను" అన్నాడు సన్యాసిరావు గట్టిగా... "దేనికీ మీరు ఇబ్బంది పడొద్దు విశాలాక్షి గారింట్లో ఊరకే మొహమాట పడకండి. వీలైనంత త్వరలో వచ్చేస్తాను. ఉంటాను." అంటూ ఫోన్ పెట్టేసింది శకుంతల. ఎన్ని రోజులకు శలవు వ్రాయాలో అడగాలనుకొని మర్చిపోయిన సన్యాసిరావుకి చప్పున ఆ సంగతి అప్పుడు గుర్తొచ్చింది. నాలుగు రోజులకి వ్రాస్తే సరిపోతుందిలే. దాంట్లో సమస్యేముంది అనుకొన్నాడు. కానీ ఫోన్‌లో విన్పించిన భార్య ఏడుపు చెవులనించి మనసుకు సోకింది. ఏదో ఓ మూల బాధ గుండెని మెలిపెడుతోంది. సన్యాసిరావు శకుంతలది లవ్ మ్యారేజి. తమ తల్లిదండ్రులకిష్టం లేక ససేమిరా అన్నా వేరే కులం వాడైన అతన్ని ఎంతో తెగువతో ధైర్యంతో రిజిష్టర్ మ్యారేజ్ చేసుకుంది శకుంతల. తనప్పటికి ఒక ప్రైవేట్ కంపెనీలో అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తున్నాడు. ఆమె గవర్నమెంట్ కాలేజిలో లెక్చరర్. అందుకేనేమో ఎంతో ఆత్మ విశ్వాసంతో దేనికి తలవంచక ఒకటి కాగలిగారు. ఇప్పటికి పాతికేళ్ళు పైగానే గడిచింది. మొదట్లో తమ ఇంటికి రావటానికి ఇరు పక్షాల బంధువులు కాస్త వెనుకాడినా క్రమేణా వస్తూపోతూ ఇప్పుడంతా కలిసిపోయారు. పెళ్ళయిన ఏడాదికే పాపపుట్టింది. ఆ తర్వాత రెండేళ్ళకు ఏవో కారణాంతరాలవల్ల సన్యాసిరావును ఉద్యోగంలోంచి తీసివేశారు. అంతకు ముందు అకేషనల్‌గా తాగే అలవాటున్న అతను రోజంతా ఏపనీ లేక లేజర్ అవటంతో క్రమంగా తాగుడికి బాగా అలవాటుపడ్డాడు.

తర్వాత తనంటూ ఉద్యోగానికి చేసిన ప్రయత్నమేదీ లేదు. భార్య చూసిన రెండు మూడు ఉద్యోగాలకు విముఖత చూపించటంతో ఆమె గూడా ఆపై ప్రయత్నాలు విరమించుకుంది.


ఏనాడు అతను సంపాదన గురించి కానీ ఉద్యోగాల గురించి కానీ మాట వరసకైనా ఒక్క మాట కూడా అడిగుండలేదు. తనకొచ్చే జీతంలో ఎంతో నేర్పుతో అన్ని అవసరాలకు సర్దుకొచ్చింది. ఏ అవస్థలు పడి తెచ్చేదో తెలియదు కానీ భర్త అడిగిందే తడవుగా కాదనేదికాదు. మొదట్లో తన తాగుడు గురించి తెలిసినా పెద్దగా పట్టించుకున్నట్లు అన్పించేది కాదు. తర్వాత పాప పెద్దదై అవసరాలు పెరుగుతున్న కొద్దీ తనకు డబ్బు ఇవ్వాల్సి వచ్చినప్పుడల్లా తాగుడు గూర్చి మాత్రం మాట మాత్రంగా హెచ్చరిస్తూండేది. కానీ అది డబ్బు గురించి ఇబ్బంది కాదని తాగుడు ఒక వ్యసనంగా మారి అందరిలోనూ కుటుంబ గౌరవం దిగజారుతుందన్న నిజం గ్రహించే భార్య నొచ్చుకుంటుదని అతనికి తెలియకపోలేదు. ఎందరేవిధంగా చెప్పినా తను మాత్రం తాగుడు మానలేదు. బంధువుల్లోనూ కాలేజిలోనూ ఎన్నో అవమానాలు పడ్తున్న తన భార్య గురించి అతను

ఏ రోజు ఆలోచించలేదు. చిన్న చిన్న తగవులు మొదలు పెద్ద పెద్ద గొడవలు వరకు ఎన్ని జరిగినా అతను మందును మర్చిపోలేదు. పైగా ఉద్యోగం లేక ఏ సంపాదన లేదనేగా నువ్వు నన్నింత హీనంగా మాట్లాడుతున్నావంటూ భార్యలో తనపైగల అభిమానాన్ని క్యాష్ చేసుకునేవాడు. ఒక ఉద్యోగినికి నిరుద్యోగ భర్తగా ఫీలవుతున్నట్లుగా నటిస్తూ తన పట్ల సానుభూతి పెంచుకునేవాడు. రోటీన్‌గా కాలం గడిపేందుకు అలవాటు పడ్డాడు. కూతురు పెళ్ళైతను తాతవుతున్నా ఇప్పటికీ తన దినచర్యలో మార్పు లేదు. ఉదయం కాఫీ టిఫెన్లు కానిచ్చేసి బీరువాలో డబ్బులు జేబులో వేసుకుని పదింటికల్లా ఇంటి నించి బయట పడతాడు. గుళ్ళు గోపురాలు లైబ్రరీలంటూ మధ్యాహ్నం దాకా కాలక్షేపం చేసి వస్తూ వస్తూ దారిలో బార్‌లో ఏదో ఒక బ్రాండ్ బ్రాందీనో, విస్కీనో తన కిష్టమైన దాన్ని తీసుకొని ఇంటికి చేరతాడు. చేరి చేరగానే తెచ్చిందాన్ని పట్టించేసి తనకోసం డైనింగ్ టేబుల్‌పై సర్ది ఉంచిన లంచ్‌ని సుష్టుగా లాగించేసి బెడ్‌పైకి చేరి సాయంత్రం భార్య ఇంటికొచ్చేదాకా శుభ్రంగా నిద్రపోతాడు. కాలేజి నుంచి ఆమె రాగానే నిద్రలేచి స్నానం చేసి టాయ్‌లెట్ అయ్యి కాఫీ టిఫెన్లు కానిచ్చేసి ఆరింటికల్లా మళ్ళీ ఇంటి నుంచి బయటపడతాడు.

స్కూటర్‌పై అలాచక్కర్లు కొడుతూ ఏదో ఒక ఫ్రెండ్ ఇంట్లో కూర్చుని పి.సి ఆడుతూ రాత్రి ఎనిమిది, తొమ్మిది గంటలకల్లా ఇల్లు చేరతాడు. ఈలోగా జేబులో బరువుంటేనో ఫ్రెండ్స్ ఇప్పిస్తేనో తాగటం వారంలో నాలుగైదు రోజులు జరుగుతూంటుంది. ఈ విధంగా పనీ పాటా లేని ఖాళీ తాగుడు నేర్పిందో తాగుడు కోసమే పనిపాటా వద్దనుకున్నాడో సన్యాసిరావు మాత్రం పక్కా త్రాగుబోతయ్యాడు. ఒక్కోసారి ఒళ్ళు తెలియని మైకంలో ఏదో ఒక ఫ్రెండ్. ఇంట్లోనో, బార్‌లోనో పడుండటం పెట్రేగి ఎక్కడో ఓ చోట లూజ్‌గా మాట్లాడి తగవులు తెచ్చుకోవటం అతని జీవితంలో సర్వసాధారణం అయిపోయింది. భార్య వీటన్నింటిని మౌనంగా భరిస్తూ ఎవరికీ చెప్పుకోలేని దుఃఖాన్ని తనలోనే అణచుకుంటూ ఎంతగా కుమిలిపోతోందో తనకు తెలిసినా అతన్లో మార్పు లేదు. చివరకు కడుపున పుట్టిన బిడ్డ ఛీదరించుకున్నా అతను సిగ్గుపడలేదు. అయితే దీని గురించి ఇంట్లో గొడవ జరిగినప్పుడల్లా ఎన్నోసార్లు తనలోతానే ఆత్మ విమర్శ చేసుకునేవాడు. తన అలవాటు వల్ల తనకు తన కుటుంబానికి కలుగుతున్న నష్టాన్ని గురించి ఆలోచించేవాడు. ఆక్షణంలో తీవ్ర పశ్చాత్తాపానికి గురై ఎలాగైనా మందు మానేయ్యాలనుకునేవాడు. కానీ ఆక్షణం దాటగానే అదే బలహీనత అతన్ని ఆవరించేది. తన తప్పు తనకు తెలిసినా దాన్ని సరిదిద్దుకోలేని మానసిక వైకల్యం అతనిది. బుద్ధి విచక్షణ మందగించి వ్యక్తిత్వం దిగజారి పోతున్నా గుర్తించలేని హీనస్థితి దాపురించిందతనికి. తాగుడు ఒక మనిషిలోని చదువు సంస్కారాలను రూపుమాపుతూ అతన్ని ఎంతగా పతనావస్థకు గురిచేస్తుందో దానికి సన్యాసిరావే సాక్షి. ఈ సంగతి తెలిసేనేమో..... శకుంతల ఎక్కడకైనా వెళ్ళాల్సి వచ్చినప్పుడు కనీసావసరాలకు సరిపడా డబ్బు మాత్రమే అతనికి అందుబాటులో ఉంచి వెళ్తూంటుంది. ఆలోచనలకు ఫుల్‌స్టాప్ పెడతూ బాత్‌రూమ్‌వైపు కదిలాడు సన్యాసిరావు. టాయ్‌లెట్ అయి విశాలాక్షి ఇంటివైపు దారితీశాడు. అతన్ని చూస్తూనే ఆమె.... "రా అన్నయ్య..... ఈ రోజు లేటయ్యిందేం? ఇందాక చాలా సేపు కాలింగ్ బెల్ మ్రోగించాను. మంచి నిద్రలో ఉన్నట్టున్నావ్" అంటూ పలకరించింది. "ఊ అన్నాడు చిన్నగా." శకు ఈ రోజు వచ్చేస్తుందిగా" అంది. "రావటం లేదని సంగతంతా చెప్పాడు. అతను మూడీగా ఉండటం ఆమె గమనించింది. ఆమె పెట్టిన టిఫిన్ తినేసి చేయి కడుక్కుంటూ.... "ఒక వంద ఉంటే సర్దగలవమ్మా! అది రాగానే...." అతని మాట పూర్తయ్యేంతలో వందరూపాయలు తెచ్చి టీవి టేబుల్‌పై పెట్టింది విశాలాక్షి. మౌనంగా వచ్చి దాన్నందుకుంటూ ఆమె వంక గిల్టీగా చూశాడు. ఆమె తననే చూస్తూండటం గమనించి కుంచించుకుపోయాడు.

* * *

బార్‌లో కూర్చుని బాయ్‌ని కేకేశాడు. బాయ్ అతన్ని చూసి లోపలికెళ్ళి కాసేపాగొస్తూ అతని వద్దకొచ్చి ట్రే లోంచి తను తెచ్చిన పీటర్ స్కాట్ విస్కీ హాఫ్ బాటిల్, కిన్లే షోడా బాటిల్, ఓపెనర్, మంచింగ్ కోసం వేయించి ఉప్పూ కారం జల్లిన జీడిపప్పు, రెండు ఖాళీ గాజు గ్లాసులు అతని ముందున్న టేబుల్ పై ఉంచాడు. వాటిని చూడగానే సన్యాసిరావుకి ఆశ్చర్యం వేసింది. అది తన బ్రాండ్ కాదు. ఏనాడు అంత కాస్ట్లీ ఆర్డర్ ఇచ్చి ఉండలేదు. సర్వర్ కొత్త వాడిలా ఉన్నాడు. చుట్టు ప్రక్కల పరికించి చూశాడు. ఎక్కువ మంది వైట్ హాల్‌ను తాగుతూ ఎంజాయ్ చేస్తున్నారు. ఎదురుగా ఉన్న బాటిల్ వంక చూస్తూ జేబుపై చేయివేసి గట్టిగా నలుపుకున్నాడు. ఫెళఫెళమని శబ్దం చేస్తూ వంద నోటు తనొక్కదాన్నే ఉన్న సంగతి జ్ఞాపకం చేసింది. ఎలా? పీటర్ స్కాట్‌ను చూసింది మొదలు సన్యాసిరావు నరాలు జివ్వుమంటున్నాయి. అయినా వచ్చిన అవకాశం వదులుకునేంత పిచ్చివాడు కాదు. త్రాగిన తర్వాత ఎవ్వరూ ఏమీ చేసేది లేదు. బాటిల్ ఓపెన్ చెయ్య బోతుండగా బార్ ఓనరొస్తూ.... "అయ్యా.... కాస్త ఆగండి. అది మీ కోసం కాదు. కుర్రోడికి తెలియక చేశాడు." అంటూ "ఒరేయ్ వీటిని తీసి ఆ టేబుల్‌పై పెట్టు. అయ్యగారికి కావలిసింది తీసుకురా." అన్నాడు బాయ్‌తో కోపంగా. "వద్దులే ఈసారికిలా కానిద్దాం" అన్నాడు సన్యాసిరావు. "అయ్యా అప్పులివ్వటం లేదు. మీకు తెలుసుగా!" అన్నాడు ఓనర్. సన్యాసిరావుకు బుస్సున కోపమొచ్చింది. అంతలోనే తమాయించుకొని తను ఈ షాపుకి రెగ్యులర్ కష్టమర్. అలా అనటం తనతోనేకాదు. వాడి బిజినెస్ సిష్టం వాడిది. అనుకున్నాడు మనసులో. అయితే బెట్టు చెడకూడదన్న ఉద్దేశ్యంతో కోపం నటిస్తూ చివాలున లేచి బయటకొచ్చేశాడు. వెనుక




నుండి పిలుస్తున్న బార్ ఓనర్ మాటలు విన్పించుకోలేదు. స్కూటర్ మీద పోతూ తీవ్రంగా ఆలోచిస్తున్నాడు. అతనికిప్పుడు వాడి మీద కోపంకన్నా కోరుకున్నది త్రాగాలన్న మక్కువే మదిని అతాకుతలం చేస్తోంది. తనకోర్కె తీరాలంటే హీనపక్షం నాలుగైదొందలు కావాలి. అంత డబ్బు ఇప్పుడు తనెక్కడ నుంచి తేవాలి. విశాలాక్షిని ఏ పరిస్థితుల్లోనూ తను ఇక అడగలేడు. అహం చంపుకుని స్నేహితుల్ని అడగాలన్నా ఈ టైమ్‌కెవరూ అందుబాటులో ఉండరు. బుర్ర ఎంత వేగంగా పని చేస్తున్నా మార్గం తోచటం లేదు. శరీరంలో ఏదో అనీజిగా ఉండటం గమనించాడు సన్యాసిరావు. యధా ప్రకారం రోజులా ఈ రోజు మందు గొంతు దిగక పోవటంతో మేనులో సన్నగా వణుకు ప్రారంభమైంది.

ఆలస్యం చేయకుండా దారిలో ఓ బార్‌లో దూరి మందు రెండు రౌండ్లు పట్టించాడు. తాగిందే తడవుగా పీటర్ స్కాట్ బాటిల్ రూపం మదిలో పెరిగి పెద్దదవుతున్నట్లు అన్పించసాగింది. స్కూటర్ కన్నా వేగంగా ఆలోచనలు పరిగెత్తుతుండగా ఇంటికి చేరాడు. ఇంట్లోని అణువణువును శోధిస్తున్నాడు. అసలేకిక్కెక్కి ఉండటంతో తగని చిరాకుతో చేతికందిన వస్తువులను అటూ ఇటూ గిరాటేస్తూ డబ్బు కోసం గాలిస్తున్నాడు. ఎక్కడా చిల్లర మల్లరే కానీ పెద్ద మొత్తం చేతికి చిక్కలేదు. అంతలో హఠాత్తుగా దృష్టి షెల్ఫ్‌లో తనకెదురుగా నున్న శకుంత పాస్ బుక్ పై పడింది.

* * *


మధ్యాహ్నం పన్నెండు గంటలు. బ్యాంకంతా హడావిడిగా ఉంది. అక్కడున్న అన్ని కౌంటర్ల ముందు కస్టమర్లు రద్దీగా ఉన్నారు. లోపలికి రాగానే బ్యాంకంతా కలయజూశాడు సన్యాసిరావు. ఎవరికి వారు మరోకరితో పనిలేదన్నట్లు ఎవరి పని వారు చేసుకుంటున్నారు. ఉద్యోగస్తులందరూ వారి ముందున్న కంప్యూటర్లను పరకాయించి చూస్తూ అదో విధమైన ట్రాన్స్‌లో ఉన్నట్లు కన్పిస్తున్నారు. ఎంట్రన్స్‌కు ఎడమవైపుగా ఎ.సి. గ్లాస్ రూమ్‌లో కూర్చొనున్న చీఫ్ మేనేజర్‌పై అతని దృష్టి పడింది. ఆమె పేరు శారద. శకుంతలకు బాగా పరిచయమున్నావిడ. తర్వాత టర్మ్ డిపాజిట్స్ కౌంటర్‌లో కూర్చున్న ఆనంద్‌ను చూశాడు. అతనెవరో కాదు. విశాలాక్షి భర్త. భార్యతో ఎప్పుడూ బ్యాంక్‌కు వచ్చే అలవాటుండటంతో అందరూ అతనికి ముఖ పరిచయస్తులే.... సెక్యూరిటీ గార్డు తనవైపు అదోలా చూస్తూండటంతో అతనిలో ఏదో తెలియని అలజడి రేగసాగింది. తను చేయబోతున్నపని తప్పని అతనికి తెలియకకాదు. పైగా తను తాగున్నాననుకున్నప్పుడల్లా కొండంత ధైర్యం అతన్ని ముందుకు తోస్తోంది. మెల్లగా నాలుగడుగులు వేసి అటెండర్నడిగి విత్‌డ్రాయల్ ఫారమ్ తీసుకున్నాడు. ప్రక్కనే ఉన్న టేబుల్ పై పెట్టి చకచకా పూర్తి చేస్తూ తన చుట్టు ప్రక్కలందరూ తననే గమనిస్తూ ముక్కుపుటా లెగరేయటం గమనించాడు. మందు గుభాళింపేమో! అందరి వైపు ఒకసారి చూసి నవ్వుతూ బ్యాంక్ పేమెంట్స్ కౌంటర్ల వైపు దారి తీశాడు. ఓ కౌంటర్లో తన చేతిలోని ఫారాన్నిచ్చి ఆ వైపే కళ్ళు చిట్లించుకొని చూడసాగాడు. అతనిచ్చిన ఫారంపై "ఏవో రాస్తూ శకుంతలగా రొచ్చారోండీ?' అనడిగాడు ఆ క్లర్కు. 'ఆఆ.... వచ్చారు" చెప్పునేశాడు సన్యాసిరావు. చేతికి టోకెన్ వచ్చేసింది. అతని మది పులకించిందొక్కసారిగా. అయితే మందు నెత్తికెక్కటంతో అదో రకమైన వికారం మొదలైంది. శరీరం దూది పింజలా మారి గాలిలో తేలిపోతున్న ఫీలింగ్ కల్గుతోంది. ఇదేమి తనకు కొత్త కాకపోయినా ఎప్పుడేమౌతుందో నన్న భయం మాత్రం అతన్ని ఆందోళన పరుస్తూనే ఉంది.




బ్యాంకులోని ప్రతి వ్యక్తినీ తీక్షణంగా పరిశీలించి తననెవరూ గమనించటం లేదని గ్రహించి కుదుట పడ్డాడు. నెంబర్ 27 అంటూ విన్పించటంతో ఒక్క ఉదుటున ఆవైపు కదిలాడు సన్యాసిరావు. అప్పటికే అతను తూలి పడబోతూ పక్కనతని భుజాన్ని ఆసరా చేసుకొని ఆవైపు రావటం గమనించాడు క్లర్కు. టోకెన్ తన చేతికివ్వగానే 'శకుంతలగారేరండి?' అనడిగాడు. మూసుకుపోతున్న కళ్ళు తెరచుకుంటూ ఓవైపుగా వేలు చూపించాడు సన్యాసిరావు. కూర్చున్న సీటులోంచి లేచి ఆవైపు చూస్తూ 'ఎక్కడా కన్పించరేం? ఆమె రానిదే ఇవ్వటం కుదరదు' అన్నాడు క్లర్కు గట్టిగా. భయాన్ని ముఖంలో కన్పించనీయకుండా "ఆమె వెళ్ళిపోయిందయ్యా' అన్నాడు మత్తుగా. "అయితే కుదరదు" అన్నాడు క్లర్కు. నోటిదాకా వచ్చిన బాటిల్ నేల పాలయినట్లు ఫీలయ్యాడు సన్యాసిరావు. "ఎక్కడికెళ్ళారు?" వ్యంగ్యంగా అన్నాడు క్లర్కు. "ఏం నీకు చెప్పి వెళ్ళాలా?' రెట్టిస్తూ అన్నాడు. "ఎకౌంట్ హోల్డర్ ఎవరైతే వారికే క్యాష్ ఇవ్వాలండి." అని క్లర్కు అనేంతలో "నువ్వు నాకు రూల్స్ చెప్పబోక. నీ పని నువ్వు చేయి - టోకెన్ నీ చేతి కొచ్చిందా. లేదా.' కోపంగా అన్నాడు సన్యాసిరావు. ఓహో అతన్నే కనుక్కుందాం అంటూ సదరు క్లర్కును పిలిచాడు ఆ క్లర్కు. రాగానే విషయమంతా చెప్పాడు. వినగానే ఖంగు తిన్న ఆ క్లర్కు "ఇందాక ఆమె వచ్చిందన్నారు. ఇప్పుడేమో వెళ్ళిందన్నారు. అసలీ సంతకమెవరిది?" అన్నాడు గాబరాగా "సంతకం నాదే నయ్యా ఏం జేస్తావ్. ఇప్పుడు డబ్బియ్యనంటవా! నీ బాబుగాడి సొమ్మేమన్నా ఇస్తున్నావా" సన్యాసిరావు అపసవ్యంగా మాట్లాడటం మొదలు పెట్టాడు. దాంతో ఆ కౌంటర్‌లో క్లర్కు చీఫ్ మేనేజరు వద్దకు గబగబా వెళ్ళటం చూసిన సన్యాసిరావు "ఏయ్ ఎక్కడికెళ్తున్నావ్? టోకెన్‌కు డబ్బు లివ్వరా ఏమిటి?" అంటూ పెద్దగా అరుస్తూ ఆ వైపు కదిలాడు. దాంతో ఒక్కసారిగా అందరి దృష్టి అతనిపై పడింది. "నా పెళ్ళాం డబ్బులు నా

ఇష్టం. పెడవడండీ ఇవ్వనంటానికి. ఎక్కడికెళ్ళిందో ఏడికి చెప్పేళ్ళాలా! మేనేజర్ దగ్గరకెళ్ళాడు. ఏం చేస్తారంట?" అంటూ పెద్దగా నవ్వుకోసాగాడు. "ఇంతలో ఎవరు? ఏమిటీ అరుపులు! ఇది బ్యాంక్ డీసెంట్‌గా బిహేవ్ చెయ్యండి." అంటూ మేనేజర్ శారద బయటకొచ్చింది. ఆమెతో పాటుగా నలుగురు ఉద్యోగులు ఆమెను అనుసరించారు. బ్యాంకులో పిన్‌డ్రాప్ సైలెన్స్ ఉంది. "ఆ మాత్రం నాకు తెల్సు. ఇచ్చిన టోకెనుకు డబ్బులివ్వటం నేర్పుముందు నీగుమాస్తాగాళ్ళకి." అమర్యాదగా బదులిచ్చాడు. అవేం పట్టించుకోకుండా సన్యాసిరావు ఇచ్చిన విత్‌డ్రాయల్ ఫారాన్ని కన్‌సర్న్‌డ్ క్లర్కు తెచ్చిచ్చిన ఓ రికార్డును టాలీ చేసి చూస్తూ అతనివైపు ఓసారి తలెత్తి చూసింది. ఓ చోట నిలకడగా నిలబడటానికే కష్టపడుతూ తూగుతున్నాడు సన్యాసిరావు. నెమ్మదిగా దగ్గరకొస్తూ ఆమె, "చూడండి మీ భార్య మాకు రెస్పెక్టెడ్ కస్టమర్. ఆమె భర్తగా మిమ్మల్ని మేమెల్లప్పుడూ గౌరవిస్తాం" అంది శాంతంగా.

"ఏమిటీ దాని మెగుడ్ని గౌరవిస్తావా! అంటే నేను పైసాకి పనికిరాననా! యూనో హూయామ్ ఐ? ఐయామ్ ఎ పోస్ట్ గ్రాడ్యుయేట్" అంటూ గుడ్లు క్రిందకు మీదకు కదిలించాడు. "అలాంటప్పుడు మీరు ఇలా ప్రవర్తించకూడదు" అంది శారద. "ఐనో వాట్ ఐ హేవ్‌టు డు" అన్నాడు. "వాట్ డు యునో? సంతకాన్ని ఫోర్జరీ చేయటమేనా? అది చిన్న తప్పుకాదు. పెద్ద నేరం" అంది కాస్త కోపంగా "ఏంటి ఫోర్జరీనా?" ఫక్కాలున పెద్దగా నవ్వాడు సన్యాసిరావు. అతని పని అడకత్తెరలో పోక చెక్కయింది. తన తప్పును పసిగట్టేశారని గ్రహించాడు. దబాయించటం వినాగత్యంతరం లేదు. "దాని సంతకం ఫోర్జరీ చేయాల్సిన అవసరం నాకేముంది! నేనడిగితే డబ్బు కాదంటుందా? తనే నన్ను పంపించింది." మరో అబద్ధం ఆడాడు. "సో.... నో ప్రాబ్లం. ఫోన్ చేసి ఆవిడ్నే కనుక్కుందాం" అంది మేనేజర్ శారద. "ఆగు నా పెళ్ళానికి ఫోన్ చేయటానికి నువ్వెవరు. ఏం నేను తాగుబోతులా కన్పిస్తున్నానా? పెళ్ళాం సంతకం ఫోర్జరీ చేసే దద్దమ్మలాగున్నానా? అసలెవడు. నీకీ ఉద్యోగం ఇచ్చింది? ఆడ పెత్తనమయితే ఇలాగే ఉంటుంది మరి" అంటూ వదరుబోతుగా మాట్లాడ సాగాడు. ఆ మాటలు విన్నాక ఆవేశంతో అతనివైపుకు కదలబోయిన సెక్యూరిటీ గార్డును చేత్తోనే సైగ చేస్తూ వారించింది శారద. కస్టమర్స్‌లో కలకలం బయలుదేరింది. పరిస్థితి గమనించిన శారద..... పాస్ బుక్ తిరిగిస్తూ...."దయచేసి మరోసారి ఆమెతో రండి" అంది. "పెళ్ళాం సొమ్ము మొగుడుకివ్వొద్దని రూలుందా?" అంటూ ఆమె




ప్రక్కనే ఉన్న క్యాషియర్ చొక్కా పట్టుకు గుంజటం ప్రారంభించాడు సన్యాసిరావు. అతని రెండు చేతులను విదిల్చికొడుతూ క్యాషియర్ శారద వంక అసహనంగా చూశాడు. ఇంతలో ఆనంద్ తన చెవిలో ఏదో చెప్పటంతో.... "అసలు మీ ఆవిడ ఊర్లో లేదుగదా! ఏంటీ గొడవ" గొంతు హెచ్చిస్తూ అధికార పూర్వకంగా అంది శారద. ఆ సంగతి అతనే చెప్పాడని గ్రహించి "ఏరా! నీ ఇంటికి ముద్దకొస్తున్నానని నీకూ లోకువైపోయానా!" అంటూ ఆనంద్ వైపు వేగంగా కదిలాడు సన్యాసిరావు. అదుపు తప్పాడని గ్రహించి బ్యాంక్ సిబ్బంది కొందరు అతన్ని గట్టిగా పట్టుకొని వెనక్కి లాక్కురావటం మొదలుపెట్టారు. దాంతో మరింత రెచ్చిపోయిన సన్యాసిరావు వాళ్ళను విడిపించుకొని "ఆడదాని క్రింద పనిచేసే చవటల్లారా! మీలో దమ్మున్న మగాడెవడో ఒక్కొక్కడుగా రండి. ఇవాళ మీ సంగతీ, మీ మేనేజర్ సంగతి తేలిపోవాలంటూ" పెద్దగా అరవసాగాడు. అతను పూర్తిగా ఔటాఫ్ కంట్రోలని గ్రహించిన సెక్యూరిటీ గార్డ్ కోపంతో పెద్ద పెద్దగా రంకెలేస్తూ సన్యాసిరావు రెక్క పట్టుకుని బయటకు లాక్కెళ్ళ సాగాడు. సన్యాసిరావు రెండు చేతులతో బలంగా అతన్ని నెట్టగానే అతను ప్రక్క నున్న బల్లపై పడటంతో పెద్దగా చప్పుడైంది. చేతికందిన వస్తువునల్లా అటూ ఇటూ విసిరేస్తూ నోటికొచ్చినట్లు మాట్లాడుతున్న అతన్ని ఎలా అదుపులోకి తేవాలో తెలియలేదు శారదకు. "అమ్మా! ఇలాంటి త్రాగుబోతులందరూ బ్యాంక్ కొచ్చి అల్లర్లు చేస్తే మీ బ్యాంక్ పేరు ప్రతిష్టలేమౌతాయో ఆలోచించారా? పైగా ఇక ఆడవాళ్ళు ఏ ధైర్యంతో బ్యాంకుల కొస్తారు? వెంటనే పోలీస్ కంప్లయింట్ ఇవ్వండి. అంటూ తన చుట్టూ చేరిన కస్టమర్లు ముక్త కంఠంతో చెప్పటంతో తన కిష్టం లేకపోయినా విధి నిర్వహణలో భాగంగా ఫోన్ వైపు అడుగులేసింది శారద.

* * *

రాత్రి తొమ్మిది గంటలు. పోలీస్ స్టేషన్‌లో బల్లపై ఓ మూలగా తల దించుకు కూర్చున్నాడు సన్యాసిరావు. మత్తు పూర్తిగా దిగటంతో తను చేసి తప్పిదానికి సిగ్గుతో చచ్చిపోతున్నాడు. కొంతసేపటికి బయట ఆటో ఆగిన చప్పుడవటంతో తలపైకెత్తి చూశాడు. మేనేజర్ శారద, తన భార్య శకుంతల, ఆనంద్‌లు కలసి హడావిడిగా పోలీస్ స్టేషన్‌లోకి రావటం కన్పించింది. పోలీస్‌లు తనని బ్యాంక్‌నుంచి తీసుకురాగానే ఆనంద్, శకుంతలకు ఫోన్ చేసాడని. తన భార్య వెంటనే బయల్దేరొచ్చి శారద కాళ్ళా వేళ్ళా పడి కంప్లయింట్ విత్‌డ్రా చేయించటానికి తీసుకొచ్చిందని యస్సైతో వారు మాట్లాడుతున్నప్పుడు వారి మాటల వల్ల గ్రహించ గలిగాడు. స్టేషన్‌లో పని ముగించుకొని బయటకొస్తూ "వెళ్ళొస్తానండి శకుంతలగారు!" ఆమె వైపు సానుభూతిగా చూస్తూ అంది శారద. ఆ మాటకు కళ్ళ నీళ్ళ పర్యంతమయిన శకుంతల రెండు చేతులెత్తి నమస్కరిస్తూ.... "మీ మేలు ఈ జన్మలో మరువలేను..." చివరి మాటలు పూర్తిగా పలుకు లేకపోయింది. శారద, ఆనంద్ ఎక్కిన ఆటో సాగిపోయిన వైపే చూస్తూ నిల్చుండిపోయింది స్థాణువులా. ఇప్పుడు భార్య కళ్ళల్లోకి సూటిగా చూసే ధైర్యం చాలటం లేదు సన్యాసిరావుకి. బహుశా దానిక్కూడా గొంతులో మందు పడాలేమో?

బలహీనతలకి బానిసలైన ఇలాంటి బడుగు సన్యాసిరావులు ఎంతమందో ఈ లోకంలో......